క్లుప్తంగా

మావుళ్లమ్మను దర్శించుకున్న తూర్పు గోదావరి ఎస్పీ



శ్రీమావుళ్లమ్మవారి సన్నిధిలో తూర్పు గోదావరి ఎస్పీ నర్సింహం దంపతులు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారిని తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ గుండా నర్సింహం దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

శ్రీదేవి ట్రస్టు సేవలు అభినందనీయం



కాళ్లకూరులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కాళ్ల: కాళ్లకూరులో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు తరపున వెంకటరామరాజు చేస్తున్న సేవలు అభినందనీయమని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. కాళ్లకూరులో శుక్రవారం ఉచిత కంటి, దంత వైద్య మెగా శిబిరాలను నిర్వహించారు. దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్, ఆకివీడు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి, భీమవరం విష్ణుదంత వైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 400 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు, ఐ డ్రాప్స్ అందజేశారు. కార్యక్రమంలో జుత్తిగ నాగరాజు, కోరా రామూర్తి, వేగేశ్న గోపాలకృష్ణంరాజు, సుంకర కాశీ, గోకరాజు శివబాబు, మాజీ సర్పంచ్ అడ్డాల శివరామరాజు, ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సిబ్బంది, విష్ణు డెంటల్ కాలేజీ డాక్టర్లు, డెంటల్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా షాపుల పరిశీలన



బాణసంచా విక్రయ దుకాణాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ జయసూర్య

ఆకివీడు: మండలంలోని అజ్జమూరు, స్థానిక ధర్మాపుర అగ్రహారంలోని బాణసంచా హోల్ సేల్ విక్రయ దుకాణాలను శుక్రవారం భీమవరం డీఎస్పీ జయ సూర్య పరిశీలించారు. బాణసంచా దుకాణాల వద్ద అగ్ని ప్రమాద నివారణ చర్యలకు తీసుకోవలసిన జాగ్రత్తలను, ఇసుక, నీటితో పాటు ఇతర పనిముట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయా దుకాణాల లైసెన్సులను పరిశీలించారు. డీఎస్పీ వెంట ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు ఉన్నారు.

రెవెన్యూ సదస్సులు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ ప్రవీణ్‌కుమార్ రెడ్డి

వీరవాసరం: రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆర్డిఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు. వీరవాసరం మండలం తోకలపూడి, పంజా వేమవరం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడారు. రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లోని ప్రజలకు, ముఖ్యంగా రైతులకు అందుబాటులో ఉంటూ గ్రామాల్లో ఏ సమస్యలు లేకుండా చూడాలన్నారు. సమావేశాల్లో తహసీల్దార్ ఏవి రామాంజనేయులు, ఆర్ఐ రూజ్‌వెల్ట్, సర్పంచ్ వీరవల్లి శ్రీనివాసరావు ,రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

పాలకోడేరు: ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలని మోగల్లు పంచాయతీ కార్యదర్శి సుజాత అన్నారు. ఈ సందర్భంగా అధికారుల అనుమతి లేకుండా అనధికార లే అవుట్లలో భవనాలు నిర్మిస్తున్న యజమానులపై మోగల్లు పంచాయతీ కార్యదర్శి సుజాత కొరడా ఝళిపించారు. ఆమె ఇటీవల కార్యదర్శిగా బదిలీపై వచ్చారు. అక్రమ నిర్మాణాల విషయం ఆమె దృష్టికి వచ్చిన వెంటనే భవన యజమానులకు నోటీసులు జారీ చేసి, నిర్మాణాలను నిలుపుదల చేశారు.

ఇంటి పన్ను వసూళ్ల వేగవంతం

మండలంలో మేజర్ పంచాయతీ మోగల్లు గ్రామంలో ఇంటి పన్నుల వసూళ్లు మందగించాయి. రూ. 24 లక్షలు వసూలు కావాల్సి ఉండగా రూ.9 లక్షల బకాయిలు పెండింగ్‌లో ఉంది. దీంతో ఇటీవల బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శి సుజాత వసూళ్లపై దృష్టి సారించారు. సచివాలయం పంచాయతీ ఉద్యోగులకు విధులు కేటాయించారు. రెండు రోజుల్లోనే రూ.2.5 లక్షలు వసూలు చేశారు.

నిర్లక్ష్యపు నీడలో..!



భీమవరం 4 వార్డులో జిమ్ చుట్టు పెరిగినపోయిన పిచ్చిమొక్కలు,గడ్డి



వర్షపు నీటిలో ఉన్న హౌసింగ్ బోర్డు పార్క్ జిమ్

- అధ్వానంగా మున్సిపల్ పార్కులు
- పెరిగిపోయిన పిచ్చి మొక్కలు
- పాడైపోయినా వాకింగ్ ట్రాక్

భీమవరం(ప్రకాశం చౌక్): నిత్యం ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతున్నాయి. వర్షాలతో అస్తవ్యస్తమవ్వడంతో చర్యలు చేపట్టాలని కోరుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వివరాల్లోకి వెళ్లే బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురిసిన భారీ వర్షాలకు పట్టణంలో పార్కులు ధ్వంసమైపోయాయి. దీంతో ఆ పార్కులు బాగు చేయాలని కాలనీ ప్రతినిధులు, యువత, స్థానికులు కోరుతున్నారు. పట్టణంలో 13మున్సిపల్ పార్కులు ఉన్న దాదాపు అన్ని పార్కుల్లో పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. వర్షాల సమయంలో పార్క్‌లో ఉన్న వాకింగ్ ట్రాక్ కూడా పూర్తిగా పాడైపోయాయి. పిచ్చి మొక్కల మధ్య ఉన్న జిమ్‌లోకి వెళ్లడానికి పట్టణ వాసులు భయాందోళన చెందుతున్నారు. పార్కులు అధ్వానంగా ఉన్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణ వాసుల నుంచి వేల రూపాయలు పన్నులు వసూళ్లు చేసే మున్సిపల్ అధికారులు పట్టణ ప్రజల కోసం,ఆహ్లాకరంగా గడిపే పార్కుల అభివృద్ధికి పైసా ఖర్చు చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

గత ప్రభుత్వంలో లక్షల ఖర్చు చేసి జిమ్‌లు ఏర్పాటు

గత జగనన్న ప్రభుత్వంలో పట్టణ ప్రజలకు ఉచితంగా జిమ్ చేసుకొవడానికి జిమ్‌లు, అలాగే వాకింగ్ చేయడానికి ట్రాక్‌లు, పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులను మున్సిపల్ నిధులు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పార్క్‌ల్లో అన్నింటిని ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో పార్క్‌ల నిర్వహణ అధికారులు భాద్యతగా చేసేవారు. ఎన్నికల్ కోడ్ వచ్చిన నాటి నుంచి నేటి వరకు పార్క్‌ల నిర్వహణ గాలికి వదిలివేశారు. అడిగేవాడు లేడు అన్నట్లు మున్సిపల్ అధికారులు పార్క్‌లను పట్టించుకొవడం లేదు. భీమవరంలో పార్క్‌లు అధ్వానంగా ఉన్న పాత కమిషనర్ శ్యామల పట్టించుకోలేదు. కొత్తగా వచ్చిన కమిషనర్ రామచంద్రరెడ్డి అయిన పార్క్‌లను అభివృద్ధికి చర్యలు తీసుకొవాలని భీమవరం ప్రజలు కోరుతున్నారు.

చినుకు పడితే చెరువే



తోకలపూడి గ్రామం వద్ద ఆధ్వానంగా మారిన ఆర్అండ్‌బీరోడ్డు



నవుడూరు జంక్షన్ వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు దుస్థితి

అధ్వానంగా వీరవాసరం- బ్రాహ్మణచెరువు రోడ్డు

భీమవరం: వీరవాసరం- బ్రాహ్మణచెరువు రోడ్డు చినుకు పడితే చెరువుగా మారుతోంది. ఇటీవల వర్షాలకు రోడ్డు పూర్తిగా పాడైపోయింది. వీరవాసరం- బ్రాహ్మణచెరువు రోడ్డు కొన్నిచోట్ల ఆధ్వానంగా మారడంతో ప్రయాణీకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వెంటనే రోడ్ల మరమ్మతులంటూ గొప్పగా ప్రచారం చేసినా ఇప్పటి వరకు గోతుల్లో కనీసం తట్టమట్టికూడా వేయడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం వేలాది వాహానాలు తిరిగే ఎంతో ప్రాధాన్యత కలిగిన వీరవాసరం-బ్రాహ్మణచెరువు రోడ్డు సుమారు 11 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ రోడ్డుకు గత ప్రభుత్వం హాయాంలో వీరవాసరం, పొలమూరు గ్రామాల వద్ద ఆధ్వానంగా ఉన్నరోడ్డును సిమ్మెంట్ రోడ్డు నిర్మించారు. చిన్న గోతులు పడినచోట అనేకచోట్ల ప్యాచ్ వర్క్ చేశారు. మిలిగినచోట్ల ఇటీవల కురుస్తున్న వర్షాలకు పెద్ద పెద్ద గోతులు పడి ఆధ్వానంగా తయారైంది. గోతుల్లో వర్షంనీరు నిలిచిపోవడంతో మోటారు సైకిలిస్టులు, చిన్నకార్లు గోతుల్లో పడి ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా తోకలపూడి గ్రామం వద్ద, నవుడూరు జంక్షన్ శివారును రోడ్డు మరీ ఆధ్వానంగా మారి ప్రయాణీకుల ఇబ్బందులు చెప్పనలనవికావు. సైకిలిస్టులు, మోటారుసైకిలిస్టులు గోతుల్లోపడి గాయాలు కావడంతో అనేకమంది ఆసుపత్రి పాలయ్యారు. రోడ్డుకు మరమ్మతుల చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన ఫలితం లేదని విమర్శిస్తున్నారు. కనీసం గోతులను పూడ్చి ప్రయాణీకులు, ప్రజలకు ఉపశమనం కలిగించాలని కోరుతున్నారు.

విద్యార్థులు టీమ్‌స్పిరిట్‌తో మంచి ఫలితాలు



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో జ్యోతిప్రజ్వలన చేసి హ్యాక్తాన్ పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: విద్యార్థులు టీమ్‌స్పిరిట్‌తో పరస్పర అభిప్రాయాలు పంచుకుని మంచి ఫలితాలు సాధించవచ్చునని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు అన్నారు. శుక్రవారం కళాశాల కోడింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 24 గంటల పాటు జరిగే హేకోవర్ ఫ్లో 2జ24 పేరిట నిర్వహించే హ్యాక్తాన్ పోటీ ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి పారంభించారు. పోటీలు సందర్భంగా విద్యార్థులు ఒకరి అభిప్రాయాలను మరొకరు పరస్పరం చర్చించుకుంటే ఎన్నో సమస్యలకు మంచి పరిష్కారం దొరుకుతుందన్నారు. కన్వీనర్ కె డేవిడ్‌రాజు మాట్లాడుతూ 209 మంది విద్యార్థులు 60 బృందాలుగా ఏర్పడి పోటీల్లో భాగస్వామ్యం అవుతున్నారని ప్రధానంగా వ్యవసాయం, మహిళా శిశు సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలు ప్రామాణికంగా తీసుకొని పోటీల్లో వాటికి ఉపయోగపడే విధంగా పరిష్కారం చూపాలని సూచించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ వి చంద్రోశేఖర్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ డీన్ కెఆర్ సత్యనారాయణ, ఇంజనీరింగ్ కెమిస్ట్రీ హెడ్ పి భవాని, ఐటీ డిపార్ట్‌మెంట్ హెడ్ పి రవికిరణ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు కలవపూడి విద్యార్థి ఎంపిక



వాలీబాల్ పోటీలకు ఎంపికైన మోహన శ్రీలక్ష్మిని అభినందిస్తున్న దృశ్యం

కాళ్ల: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు కలవపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు మాట్లాడుతూ ఈ నెల 17న ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో స్కూలు గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి వాలీవాల్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయికి మోహన శ్రీలక్ష్మి అర్హత సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థిని విస్సాకోడేటి మోహన శ్రీ లక్ష్మిని పలువురు అభినందించారు. ఉప విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు మూర్తి, పాఠశాల కమిటి చైర్మన్ ప్రియాంక, విద్యార్థులు పాల్గొన్నారు.

సంగీత నృత్య సమ్మేళనంలో కళాకారుల ప్రతిభ



భీమవరం కేజీఆర్ఎల్ కళాశాలలో కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భారతీయ సంస్కృతిలో కళలు ఒక భాగమని 64 కళలలో ఒకటైన నృత్య కళలలో కళాశాల ప్రతిభ కనబరచడం అభినందనీయమని కేజీఆర్ఎల్ కళాశాల కార్యదర్శి మెంటే రామమనోహర్, కోశాధికారి గన్నాబత్తుల శ్రీనివాస్ అన్నారు. ఈనెల 13న హైదారాబాద్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సంగీత నృత్య సమ్మేళనంలో విశేష ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించిన భీమవరం కళాకారులను శుక్రవారం కేజీఆర్ఎల్ కళాశాలలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో అభినందన సత్కార కార్యక్రమం జరిగింది. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ కేజీఆర్ఎల్ కళాశాల బి ఫార్మసీ విద్యార్థి కడలి భానుశ్రీ నృత్యంలో జాతీయ అవార్డులు సాధించడమేగాకుండా గత ఏడాది కాలంగా ఎంతోమందికి నృత్యంలో శిక్షణ ఇస్తున్నారన్నారు. తెలంగాణ నృత్య అకాడమి నిర్వహించిన పోటీల్లో భానుశ్రీతో పాటు బంతు దుర్గ శరణ్య, దుళ్ల భవానీ వర్షిత, కడిశెట్టి బాలకృష్ణవేణి, అట్టడా లక్ష్మీ భవానీ, లాస్య ప్రియ, హైమవతి పాల్గొని ప్రథమస్థానం సాధించారన్నారు. వందలాదిమంది కళాకారులు పాల్గొన్న పోటీల్లో భీమవరం పట్టణానికి చెందిన కళాకారులు విజయం సాధించడం పట్టణానికే గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో చినమిల్లి వెంకట్రాయుడు, కె నాగేశ్వరరావు, అరసవల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులతో గ్రామాల అభివృద్ధి



గ్రామసభలో మాట్లాడుతున్న టీఏ ఓమేగారాజు

ఉండి: ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని టెక్నికల్ అసిస్టెంట్ లంకపల్లి ఓమేగారాజు అన్నారు. శుక్రవారం ఉండి మండలం యండగండి, ఉణుదుర్రు గ్రామాల్లో ఉపాధి హామీ పనుల అంచనాల తయారీపై రెండో దపా గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీఏ ఓమేగారాజు మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు ఉపయోగపడేలా పంట, మురుగు బోదెల పరిశుభ్రతకు ఉపాధి హామీ పనులు వినియోగించుకోవచ్చన్నారు. అలాగే పండ్లు, పూల తోటల పెంపకానికి కూడా ఉపాధి హామీ పనులు వినియోగిచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జీవీటీ నాయుడు, ఉణుదుర్రు సర్పంచ్ నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి ఆధార్ స్పెషల్ డ్రైవ్

పాలకోడేరు : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.రెడ్డియ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆధార్ స్పెషల్ డ్రైవ్ క్యాంపులు ఈ నెల 22 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌ను మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆధార్ క్యాంప్ నిర్వహణకు కేంద్రం ఏర్పాటు చేసిన సచివాలయంలో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

విద్యుత్ చార్జీల పెంపును ఉపసహరించుకోవాలి



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

పాలకోడేరు: ట్రూఅప్ చార్జీల పేరుతో రెండు దపాలుగా విద్యుత్ చార్జీలు పెంచి, ఆ భారాన్ని ప్రజలపై మోపాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ నియంత్రణ మండలి సిఫార్సు మేరకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న వైఖరికి నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం గొరగనమూడి విద్యుత్ ఉప కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శేషపు ఆశ్రియ్య, మండల నాయకులు కొటికల శ్రీను, గోపాలరాజు, కె.వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలి



వీరవాసరంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

వీరవాసరం: మండలంలో కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని సీఐటియు వీరవాసరం మండల కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం వీరవాసరంలో జరిగిన మండల కమిటీ సమావేశానికి డి వరలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఐటియు జిల్లా నాయకులు ఎం ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలో భవన నిర్మాణ కార్మికులు, రైస్ మిల్ కార్మికులు, చేపల పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు, ఆటో కార్మికులు, పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారని వీరందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని అన్నారు. కార్మిక శాఖ కార్యాలయాల్లో వీరందరి వివరాలు ఉన్నాయని వాటిని పరిశీలన చేసి అన్ని సంస్థల్లోనూ పిఎఫ్ ఈఎస్ఐ సదుపాయం కలిప్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఇప్పటికే సీఐటియుగా కార్మికులపై వేధింపులు ఆపాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం కల్పించాలని పలుమార్లు అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశామని అన్నారు. లేబర్ అధికారులతో జాయింట్ సమావేశాలు జరుపుతామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చారని హామీని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సత్తిబాబు అంగన్వాడి యూనియన్ నాయకులు లక్ష్మి, డ్వాక్రా యానిమేటర్ల సంఘం నాయకులు సోనీ, ఆశ మిడ్ డే మిల్ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: భగవద్గీత పారాయణ బృంద భక్తురాలు, నిరంతర దాతృత్వ మూర్తి కొత్త మహాలక్ష్మి అని పలువురు వక్తలు అన్నారు. స్థానిక సుంకర పద్దయ్య వీధిలోని కొత్త రాధాకృష్ణ మూర్తి నివాసంలో కొత్త మహాలక్ష్మి ప్రథమ వర్థంతి సందర్భంగా 120 మందికి చీరలు, భోజనాలు పంపిణీ చేశారు. సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పారిశ్రామిక వేత్త కొత్త రాధాకృష్ణ మూర్తి సతీమణి మహాలక్ష్మి నిరంతరం పేదల సంక్షేమానికి సేవలు అందించే వారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్త రాధాకృష్ణ మూర్తి, కొంద్రు శ్రీనివాస్, చవ్వ భామ కృష్ణమూర్తి, కొత్త రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణకు ప్రత్యేక చర్యలు



మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న దృశ్యం

ఆకివీడు: గొర్రెలు, మేకల మంద వృద్ధికి నట్టల నివారణ మందు ప్రతీ మూడు నెలలకోసారి వేయాలని మండల పశుసంవర్థక శాఖ వైద్యురాలు భార్గవీ సత్య సూచించారు. మండలంలోని అయిభీమవరం, చెరుకుమిల్లి, సిద్ధాపురం, చినకాపవరం గ్రామాల్లో నట్టల మందు గొర్రెలు, మేకలకు శుక్రవారం వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా జంతువుల్లో అంతర్ పరాన్న జీవులు జీవించడం వలన పెరుగుదల ఉండదన్నారు. పునరుత్పత్తి సమస్యలు తలెత్తుతాయన్నారు. మరణాలు సంభవిస్తాయన్నారు. నులిపురుగులు, బద్దె పురుగులు, పొట్ట జలగలు ఉండటం వలన మంద పెరగదన్నారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేయించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో 105 మేకలు, 120 గొర్రెలకు మందు వేశారు.

తూతూమంత్రంగా రీసర్వే గ్రామసభలు



రైతులు లేక తూతూమంత్రంగా నిర్వహిస్తున్న వేంద్ర అగ్రహారంలో రీసర్వే గ్రామసభ

పాలకోడేరు: ప్రజలకు ఎంతో ముఖ్యమైన భూముల రీసర్వేపై నిర్వహిస్తున్న గ్రామసభలు తూతూమంత్రంగా సాగుతున్నాయి. శుక్రవారం పాలకోడేరు మండలంలోని కొండేపూడి, వేంద్ర అగ్రహారం గ్రామాల్లో భూముల రీ సర్వేపై గ్రామసభలు నిర్వహించారు. అయితే కొండేపూడిలో కేవలం 9 మంది రైతులు మాత్రమే ఫిర్యాదులు ఇచ్చారు .వేంద్ర అగ్రహారంలో రెండే ఫిర్యాదులు వచ్చాయి. అధికారులు, సిబ్బంది ఎక్కువ, రైతులు తక్కువ అన్న చందంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నారని పలువురు పెదవి విరుస్తున్నారు. ఇకనైనా గ్రామసభలు మొక్కుబడిగా కాకుండా చిత్తశుద్ధితో నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. సర్పంచులు చింతపల్లి వెంకటనారాయణ, కడలి లక్ష్మి రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కూనపరాజు సూర్యనారాయణరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాఘవరాజు, సర్వేయర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

కాళ్ల: గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రీసర్వే గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. కాళ్ల మండలం జక్కరంలో నిర్వహించిన రీసర్వే గ్రామసభను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి భూ సమస్యలపై వారికున్న అనుమానాలను నివృత్తి చేశారు. ఈ సభలో భూములకు సంబంధించి 11 దరఖాస్తులు అందాయన్నారు. క్షేత్రస్థాయిలో మీటింగ్ పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ సుందర్‌సింగ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ జాషువా, డివిజనల్ సర్వేయర్లు మల్లికార్జునరావు, రాంబాబు, మండల సర్వేయర్ ప్రవీణ్‌కుమార్, వీఆర్వో సుధాకర్, సచివాలయం, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): వార్డుల్లో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి సచివాలయ సిబ్బందిని ఆదేశాలు జారీ చేశారు. పట్టణంలోని 28వ వార్డులో మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రా రెడ్డి పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా వార్డు సచివాలయ సిబ్బందితో ఆయన మాట్లాడతూ వార్డులలో సేకరించే చెత్తను విడివిడిగా వాహనాలకు అందజేయాలన్నారు. అదేవిధంగా వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాలలో ఎప్పటికప్పుడు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజనీరింగ్, పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. వార్డులలో గల ఖాళీ స్థలముల యాజమానులకు నోటీసులు జారీ చేసి ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.